క్లుప్తంగా

నష్టపరిహారం చెక్కు అందజేత



మరికల్: మండలంలోని మాధవరం నరేష్‌కు చెందిన రెండు ఎద్దులు గతేడాది విద్యుదాఘాతంతో మృతి చెందగా విద్యుత్ శాఖ తరఫున వచ్చిన రూ. 80 వేలకు చెక్కును సోమవారం అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, చంద్రాయుడు, శ్రీను పాల్గొన్నారు.

టైరోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీలో గల టై రోడ్డులో ప్రభుత్వం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గుడెబల్లూర్ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కొంతకాలంగా రోడ్డు కాంట్రాక్టర్‌కు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని, దీంతో ప్రతి రోజు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

అంటరానితనాన్ని పాటించరాదు

ఊట్కూరు: అంటరానితనాన్ని పాటించరాదని సర్పంచ్ కతలప్ప సూచించారు. సోమవారం పెద్దజట్రం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంటరానితనం, బాల్యవివాహాల నిర్మూలన, మూఢనమ్మకాలు తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ–2 అజీజుల్లా, కార్యదర్శి కృష్ణారెడ్డి, ఆర్‌ఐ వెంకటేష్, నాయకులు రాఘవరెడ్డి, చిన్నసాయిలు గౌడ్, భీంరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదు

దామరగిద్ద: ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని రాజ్యసభలో కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి నారాయణ స్వామి చెప్పిన మాటలకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలని మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యసభలో ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింగ్‌రావు అడిగిన ప్రశ్నకు న్యాయశాఖ మంత్రి సమాధానం ఇస్తూ వర్గీకరణ సాధ్యం కాదని స్పష్టం చేశారన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా



మక్తల్: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా మొత్తంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోవింద్‌రాజు, బాల్‌రాం, మంజుల, గిరిజ, కన్య, రాధిక, మల్లమ్మ, సురేఖ, వెంకటమ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

నారాయణపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకోవాలని పోలీసులు తెలిపారు. సోమవారం బైరంకొండలో పౌరహక్కుల దినం నిర్వహించారు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ సమానంగా సేవలను పొందవచ్చని చెప్పారు. ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రులు, ఇతర వ్యాపార కేంద్రాల్లో ఎక్కడైన సమానంగా చూడకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేద్దాం



దామరగిద్ద: కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న నారాయణపేట నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి, వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరవేద్దామని సుజేంద్రశెట్టి అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్‌లో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా గెలిచే వరకు అధిష్టానం ఆదేశాల మేరకు అంకితభావంతో పనిచేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో జేవీరావు, గోపాల్‌రెడ్డి, నర్సప్ప, లాలప్ప, గోవర్ధన్‌గౌడ్, రాముసాయక్, వీరన్న, రాములు, వెంకట్రాములు, నరేష్‌గౌడ్, విజయ్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులను ఆదుకోండి

నారాయణపేట రూరల్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి జీపీ కార్మికులను ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా సోమవారం 26వరోజు కార్మికుల ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజును కలిసి వినతిపత్రం అందించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాజు, హన్మంతు, కృష్ణయ్య, చంద్రమౌళి, మహేష్, సాయిబాబా, రమేష్, శంకర్, వెంకటప్ప పాల్గొన్నారు.

మరికల్: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాంకోటికి వినతిపత్రం అందించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు వారి సమస్యలపై ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, అశోక్, రమేష్, సతీష్, శేఖర్ పాల్గొన్నారు.



మద్దూరులో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

మద్దూరు: ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ శశికళకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో కొండ నర్సింహులు, హన్మంతు, కార్మికులు ఆంజనేయులు, మహిపాల్, మొగులప్ప, భీములు, చిన్నమ్మ, పుష్పమ్మ, అంజిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులతో కలిసి మండల తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళఆలరు. తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందించారు.

దామరగిద్ద: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు. కార్యక్రమంలో శివకుమార్, నర్సింహ, అరుణ్, చంద్రప్ప శివానంద్, మహదేవ్, వెంకటప్ప, ఆశప్ప పాల్గొన్నారు.

మక్తల్: పంచాయతీ కార్మికులు సోమవారం తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వెంకటయ్య, అర్జున్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు



నారాయణపేట ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కోటకొండను మండలం చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: కోటకొండను మండలం చేయాలని కోరుతూ సోమవారం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అవశ్యకతను వివరించారు. 83వ రోజు దీక్షల సాధన సమితి నాయకులు కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ఏర్పాటు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివక్ష విడనాడాలని సాధన సమితి నాయకులు అన్నారు. ఇటీవల ఐదు కొత్త మండలాలను అందించి ప్రజల ఆకాంక్షలతో ఉద్యమం చేస్తున్న కోటకొండను పట్టించుకోకపోవడం విడ్డూరమని అన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నియోజకవర్గంలో కానుకుర్తి, గార్లపహాడ్‌లతో కలిపి కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 1984లో ఎన్టీఆర్ తాలుక వ్యవస్థను రద్దు చేసి మండలాల ఏర్పాటు చేసి సందర్భంలో అన్ని అర్హతలు కలిగిన కోటకొండ మండలంగా ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసిద్ధం చేసినా రాజకీయ చైతన్యం లేక వెనకబడిపోయిందన్నారు. ఉద్యమాల గడ్డ కోటకొండను మండలంగా చేయాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్మికుల గర్జన పోస్టర్ ఆవిష్కరణ



పెద్దపొర్లలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి కనకరాయుడు మాట్లాడుతూ కార్మికుల సమస్యల సాధన కోసం హైదరాబాద్‌లో ఈ నెల 4న నిర్వహించే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు, బీడీ కార్మికులకు పింఛన్ అందజేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాన్ని రూ.19వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశఆరు. కార్యక్రమంలో చిన్నబాలు, కోల కృష్ణయ్య, గుడిసె నర్సింహులు, గుర్రాల తిప్పయ్య, ఇస్మాయిల్, బషీర్, మహబూద్, రాజు తదితరుల పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



కృష్ణా: మండల తహసీల్దార్ వైపీ రమేష్‌కు ఖమ్మం జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నత రావడం గర్వంగా ఉందని నయాబ్ తహసీల్దార్ సురేష్ అన్నారు. సోమవారం తమ కార్యలయ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞప్పగౌడ, రమేష్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతు సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

శ్యాసన్‌పల్లికి బస్సు నడపాలి



డీఎంకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నారాయణపేట రూరల్: విద్యార్థుల సౌకర్యార్థం శ్యాసన్‌పల్లికి ఆర్టీసీ బస్సును నడిపించాలని పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు సాయికుమార్ కోరారు. సోమవారం డీఎం లక్ష్మీసుధకు వినతిపత్రం అందించారు. గ్రామంలో 5వ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో ఉన్నత విద్య కోసం ప్రతి రోజు 120మంది వరకు విద్యార్థులు జిల్లా కేంద్రానికి వస్తుంటారని, 4కిలోమీటర్ల దూరంలో గ్రామానికి సైతం బస్సు వేయకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో గ్రామస్తులు లేఖ ఇచ్చిన సమయంలో సీఆర్‌సీ ఆంజనేయులు బస్సు షెడ్యూల్ ఉందని, ఉదయం 9గంటలకు వస్తుందని చెప్పారని, నెల రోజులు దాటినా రావడంలేదని వాపోయారు. కార్యక్రమంలో వెంకటేష్, మోహన్, మధుసూధన్, శివ, విశ్వ, భగవంతు పాల్గొన్నారు.

ఆరుగురు బాలకార్మికులకు విముక్తి



నారాయణపేట రూరల్: ఆపరేషన్ ముస్కాన్ –9 బృందం సోమవారం జిల్లాలోని మండలాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. మరికల్, ధన్వాడ మండలాల్లోని హోటళ్లు, కిరాణదుకాణాలు, మెకానిక్ షాపులు, ఇటుకబట్టీలు తదితర చోట్ల పరిశీలించారు. పాఠశాలకు వెళ్లకుండా బాలిక, ఐదుగురు బాలురు అక్కడ పనులు చేస్తున్నట్లు గుర్తించారు. వారిని సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు.

బాధితులకు అండగా ఉంటా..



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డిలో ఇటీవల కురిసిన బారీ వర్షాలకు కూలిన ఇళ్లను సోమవారం వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటానని, వారికి అవసరమయ్యే రేకులు, ఇటుకలు, సిమెంట్‌తో పాటు ఇతర సామగ్రి అందించి వారిని అన్ని రకాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తారేష, వెంకటేష్, మల్లికార్జున్, నక్క తాయప్ప పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు



మాగనూర్: మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో సోమవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన చెట్టును కారు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన నలుగురు కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొన్నాడు. ప్రమాద సమయంలో డ్రైవర్‌తో పాటు పక్కన కూర్చున వ్యక్తి సీట్బు బెల్టు ధరించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదంలో డ్రైవర్ శరణగౌడ్‌కు కాలు విరగగా, ఎస్ఎస్ రెడ్డి, రాజప్ప, మల్లికార్జున్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వారిని మక్తల్ ఆస్పత్రికి తరలించారు.

సభకు తరలిన నాయకులు



ధన్వాడ: జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సభకు సోమవారం మండలంలోని గ్రామాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాకం సురేందర్, మల్లప్ప, గోవర్దన్‌గౌడ్, రాచంద్రయ్య, నారాయణ తదితరుల ఉన్నారు. అదేవిధంగా బీడీ కార్మిక సంఘ ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు ఇళ్లు మంజూరు, ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయుటపై కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

క్రమబద్ధీకరించాలని వినతి

ఊట్కూరు: మండల తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ తిరుపతయ్యకు సీఆర్‌పీలు వినతిపత్రం అందించారు. సీఆర్‌పీల సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ టీచర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మన్లు, సీఆర్‌పీలు ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, సరస్వతి, అస్మతుల్లా, నర్సింహులు, మహేష్, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత



మద్దూరు: సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి పోలీసులు సోమవారం అప్పగించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన పల్లె అంజయ్య తన ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేయగా ఐటీ కోర్ టీం ద్వారా ఫోన్‌ను కనుక్కుని అప్పగించినట్లు ఎస్ఐ శీనయ్య తెలిపారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆరోపణలు నిరాధారం

కృష్ణా: రాష్ట్రంలో అతి వరదల మూలంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాలు ముందస్తు చర్యలు తీసుకుందని బీఆర్‌ఎస్ యువజన మండల అధ్యక్షుడు భీమ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరదల సమయంలో ప్రజలకు అండగా ఉండాల్సిన నాయకులు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు తగదన్నారు.

సెర్ప్‌తో మహిళలకు జీవనోపాధి

- గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు



బిజ్వార్‌లో ఏర్పాటు చేసిన పిండి గిర్ని



బిజ్వార్‌లో కొనసాగుతున్న బేకరి

ఊట్కూర్: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) ద్వారా ఎనలేని కృషి చేస్తుంది. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేశారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నారు. ఆహార పదార్థాల తయారి (బేకరి), మిఠాయి దుకాణం, కారం పొడి, పిండి, మసాల దినుసులు తయారు చేసే గిర్ని తదితర యూనిట్ల ఏర్పాటు చేస్తున్నారు. యూనిట్లు నెలకొల్పిన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ అందిస్తుంది. ఊట్కూర్ మహిళా సమాఖ్య ద్వారా బిజ్వార్, పెద్దజట్రం, తిప్రాస్‌పల్లి, వల్లంపల్లిలో 8 యూనిట్లు మంజూరు కాగా, 6 యూనిట్లు ప్రారంభమయ్యాయి.

యూనిట్ల రుణాలు మంజూరు ఇలా..

బిజ్వార్‌లో శివలీల బేకరికి రూ.7 లక్షలు, నసీమా బేగం పిండిగిర్నికి రూ.4.21లక్షలు, లింగమ్మ కారం పొడి గిర్నికి రూ.5.58లక్షలు, పద్మమ్మ కారం పొడి మిషన్‌కు రూ.5.37 లక్షలు, వల్లంపల్లిలో పిండి గిర్నికి రూ.3.28 లక్షలు, పెద్దజట్రంలో మిఠాయి దుకాణం రూ.4.52లక్షలు, కొత్తపల్లిలో కారం పొడి మిషన్ రూ.3.67లక్షలు, తిప్రాస్‌పల్లిలో కారం పొడి, పిండి గిర్నికి రూ.4.21లక్షలు మంజూరు చేశారు.

రోజుకు రూ.500 ఆదాయం..



మండల మహిళా సమాఖ్య ద్వారా బేకరి యూనిట్‌ను ఏర్పాటు చేశాను. బేకరితో పాటు ఉదయం టిఫన్ సెంటర్‌ను నడుపుతున్నాను. రోజూ ఖర్చులు పోను రూ. 500 మిగులుతున్నాయి. గ్రామంలో జీవనోపాధి ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉంది.

– శివలీల, బిజ్వార్

మండలంలో 8 యూనిట్లు..



మండలంలో పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో 8 యూనిట్లు మంజూరయ్యాయి. బిజ్వార్, పెద్దజట్రం, వల్లంపల్లి, తిప్రాస్‌పల్లి, కొత్తపల్లిలో బ్యాంకు రుణాల ద్వారా యూనిట్లు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం వీరికి 35 శాతం సబ్సిడీ అందిస్తుంది.

– నిర్మల, ఏపీఎం, ఊట్కూర్

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మాగనూర్: పశువులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాలను వేయించాలని పశువైద్యాధికారి వంశీకృష్ణరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గజ్జరందొడ్డి, మందిపల్లిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. పశు సంపద తగ్గిపోతుందని పశువుల ద్వారా జీవనోపాధి దొరుకుతుందని తెలిపారు. పశువులు రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్, యశోద, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓ మృతికి నివాళి



ఎల్లయ్య (ఫైల్)

ఊట్కూరు: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న ఎల్లయ్య(54) సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలు రావడంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఓ ఆస్పత్రిలో చేరగా సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవరకద్రలో ఆయన కుటుంబాన్ని డీఆర్‌డీఓ గోపాల్ నాయక్, ఎంపీడీఓ కాలప్ప, ఈసీ శ్రీనివాసులు పరామర్శించి అంత్యక్రియలకు ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందించారు.